# రేరాణి

**- బలభద్రపాత్రుని రమణి**

రాత్రి కాగానే విచ్చుకుని తన సోయగాలతో, సువాసనలతో అలరిస్తుంది రేరాణి. తెల్లవారి చూస్తే ముడుచుకుని మూగగా చూస్తుంటుంది. ఆ సుగంధ సమీరాలన్నీ గుండెల్లో నిక్షిప్తం చేసుకుని రాత్రి కోసం ఎదురు చూస్తుంటుంది. ప్రతి రేయి ఒకేలాగా జలజలా నవ్వులు జాల్వారుతూ మనసులని ఆహ్లాదంగా మత్తెక్కిస్తూ మరులుగొలుపుతూ తనని తాను సమర్పించుకుంటుంది రేరాణి.

నాకు నైట్‌క్వీన్ అంటే చాలా ఇష్టం. నా కిటికీ అవతల నుండి వీచే ఆ పరిమళాలు ప్రతిరోజూ వాటిని అందమైన ఆలోచనల్ని ఆవిష్కరించుకుంటూ ప్రేరేపిస్తాయి. కొబ్బరాకుల గుసగుసలా చల్లని వెన్నెలా, పిల్లగాలి కవ్వింత మాత్రమే రచనలకు ప్రేరణల నివ్వవు. కొండకచో ఓ రేరాణి చెప్పే కన్నీటిగాథ కూడా కలం పట్టించడానికి పూనుకోవచ్చని నాకీమధ్యే తెలిసింది.

రాత్రిళ్లు తన అందాలనీ, సుగంధాలనీ ఆస్వాదించిన రసజ్ఞులు పగలు తన ఉనికినే పట్టించుకోరని రేరాణి ఏనాడూ చిన్నబుచ్చుకోలేదు. రాత్రి కాగానే యథాప్రకారం తన కర్తవ్యం తను నిర్వర్తిస్తూ వుంటుంది.

చాంద్‌బీబీ కూడా అంతే!

మేము ఇల్లు కట్టుకుని వచ్చిన కొత్తల్లో నాకు చాలా భయం వేసేది. ఊరి చివర ఇల్లు కట్టారని మావారిమీద పోట్లాడేదాన్ని. క్రమంగా నాకు ఆ కాలనీవాసులతో స్నేహం పెరిగింది. కాలనీవాసులతోకంటే మా ఇంటికి కాస్త ఎడంగా వుండే గుడిసెవాసులతో నాకు అనుబంధం ఏర్పడింది.

''పంతులమ్మ చదువుకుంది'' అంటూ నన్ను గొప్పగా చూస్తూ ఏ ఉత్తరమో చదివించుకోవడానికి వచ్చేవారు. పగలంతా పనిచేసి రాత్రుళ్లు తాగొచ్చే మొగుళ్లమీద తగాదాలేసుకుని నా దగ్గరకి పంచాయితీకి వచ్చేవారు. కొంతమంది ఉత్సాహవంతులు నా బలవంతంమీద పలకా బలపం పట్టి అక్షరాలు కూడా దిద్దుకున్నారు. కానీ సినిమాలు, టీవీలు కలిగించేటంత ఆసక్తి చదువు కలిగించలేకపోవడంతో మధ్యలోనే ఆపేసారు.

చాంద్‌బీబీ మాత్రం ఆపలేదు. సాయంత్రం కాగానే పుస్తకాలతో ఠంచన్‌గా వచ్చేది. జడలో విధిగా ముద్దబంతి పువ్వో, మందార పువ్వో, గన్నేరు పువ్వో ఏదో ఒకటి గుచ్చుకునేది. నోట్లో ఎల్లవేళలా పాన్ వుండి తీరేది. అందుకే నాతో ఎక్కువగా మాట్లాడేదికాదు. నవ్వవలసి వచ్చినప్పుడు మాత్రం ఉమ్మేసి వచ్చి పకపకా నవ్వేది. అది ఆగడానికి చాలా సమయం పట్టేది. పగలంతా చాంద్‌బీబీ చాలా శ్రమపడేది. మేస్త్రీలకి మట్టితట్టలు అందించేది. ఇసుక జల్లెడ పట్టేది. సాయంత్రాలు ఇరుగు పొరుగులకి బట్టలు కుట్టిపెట్టేది. కోళ్లు, బాతులు, మేకలు, అన్నింటినీ పెంచేది. ఎప్పుడూ ఏదో ఒకపని చేస్తూనే కనిపించేది. కోళ్లకి దాణా వేస్తూనో, మేకల్ని మేపుతూనో తన ఇంటిముందు వేసుకున్న కూరగాయ పాదులకి బోదెలు చేస్తూనో కనిపించేది. ఇవన్నీ మౌనంగా మాత్రం చేసేదికాదు. నోట్లోంచి ఎవర్నో ఉద్దేశించి పచ్చిబూతులు అనర్గళంగా వస్తూ వుండేవి. ఎక్కువగా అవన్నీ స్వామినాథన్‌ని ఉద్దేశించే. స్వామినాథన్ మిలట్రీలో పనిచేసి రిటైరయ్యాడు. చాంద్‌బీబీతోనే వుంటాడు. ఏ పనీ చేయడు. అది తిడ్తే పడ్తాడు. పెడితే తింటాడు. సాయంత్రాలు అది తెచ్చే మందు తాగి దానితో అలసిపోయేవరకూ పోట్లాడతాడు. ఇద్దరూ అలసి పోయేవరకూ పోట్లాడతారు.

ఇన్ని పనుల్లో వున్నా నేను మా పెరట్లో నిలబడి ''చాంద్'' అంటే ''అమ్మా'' అంటూ పరుగెత్తుకొచ్చేది. మగపనీ, ఆడపనీ అని తేడా లేకుండా చేసేది. ఏ పచ్చడో, కూరో ఇస్తే అపురూపంగా తీసుకుని ''మావాడికి మీ వంటలంటే ప్రాణం'' అనేది.

''వాడ్ని అలా కూర్చోబెట్టి మేపకపోతే ఏదైనా పన్లోకి పంపకూడదూ'' అని నేనంటే నవ్వేసేది.

వాడిని అపురూపంగా చూసేది. కూర కొద్దిగా వుంటే వాడికి పెట్టి తను పస్తుండేది. రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించిందంతా కూడబెట్టి గుడిసె స్థానంలో సిమెంట్‌తో పక్కాగా రెండు గదుల ఇల్లు వేసింది. ఆ ఇంటికి మట్టిపని దగ్గర్నుంచి సున్నం వేసేవరకూ తనే స్వయంగా చేసుకుంది. ''ఆ సున్నంలో, మట్టిలో నా రక్తం కలిపి కట్టానమ్మా'' అనేది.

చాంద్‌బీబీని చూసి కూడా ఆడది అబల అంటే ఎందుకు ఒప్పుకోవాలి? తన బలం ఉపయోగించదు. అంతే అనిపించేది. ఒక్కతే యాభై కిలోల బియ్యంబస్తా నెత్తిన వేసుకుని తెచ్చిపెట్టేది. తోటపని చేయమంటే పరమ హుషారుగా పలుగు, పారా పట్టుకుని ''అలాంటి ఇలాంటి ఆడదాన్ని కాదు మేస్తిరీ. నేను అర్ధరూపాయి డబ్బులకూ రాను మేస్తిరీ'' అని పాడుకుంటూ చేసేసేది. దాని పాటలకు మేమంతా నవ్వేవాళ్లం.

చాంద్‌బీబీ అందరితో ఇలా వుండేదికాదు. మిగతా ఇళ్లవాళ్లకు అదంటే హడల్. అమ్మో... దాని నోరు మహా చెడ్డది అని తప్పించుకునిపోయేవాళ్లు. తన మేకల్ని కొట్టినా, కోళ్లని బెదిరించినా చీరపైకి ఎగ్గట్టి జగడానిక దిగేది. మగాళ్లనైనా కొట్టి మాట్లాడేది. కొట్లాటలు పైస్థాయిలో అయినప్పుడు పిలవగానే రావడానికి ఒక కానిస్టేబుల్‌ని కూడా కుదుర్చుకుంది. వాడు వచ్చి అందర్నీ అదిలించేవాడు.

పోట్లాటలయ్యాక స్వామినాథన్ చేత కాళ్లకి నూనె మర్దనా చేయించుకునేది. మందెక్కువయితే వాడి డొక్కలో తంతూ జోరుగా పాటలు పాడేది. అలా అయిన మర్నాడు నాకు మొహం చూపించకుండా తప్పించుకు తిరిగేది. సాయంకాలం మాత్రం చదువుకోవడానికి వచ్చేసేది. నేనేం అడిగినా జవాబివ్వకుండా నోట్లో పాన్ వుందని సైగలు చేసేది.

పిల్లలు దాన్ని అనుకరిస్తూ వెక్కిరిస్తే పాన్ ఉమ్మేసి పకపకా నవ్వేది. కానీ బదులు చెప్పేదికాదు.

ఆ రోజు సాయంత్రం నిర్మల రమ్మని ఫోన్ చేస్తే వెళ్లాను. అప్పటికే మా మిగతా మిత్రబృందం అంతా సమావేశం అయ్యారు. నేను వెళ్లగానే ఆలస్యం అయినందుకు సంజాయిషీలడిగారు. వాళ్లు నామీదా, నా రచనలమీదా వేసే జోక్స్‌ని ఆలకిస్తూ నేను ఆనందిస్తుండగా ''నీకో పని తగిలిందే'' అంది నిర్మల.

''ఏమిటే?'' అన్నాను.

''ఆ అమ్మాయిని చూడు'' అంది నిర్మల.

గుండ్రంగా అమర్చిన కుర్చీల్లో ఓ చివర ఒద్దికగా పైట మెడ చుట్టూ కప్పుకుని కూర్చునుంది ఓ స్త్రీ.

''తన పేరు విమల. తనని, ఇద్దరు పిల్లల్నీ వదిలేసి మొగుడు ఇంకో దానితో వుంటున్నాడు. దానికి ఇల్లు కూడా కట్టించిపెట్టాడు. ఈమె ఒంటరిగా వాళ్లింట్లో, వీళ్లింట్లో పని చేసుకుంటూ పిల్లల్ని పెంచుకొస్తోంది. పైగా పిల్లకి ఫిట్స్‌కూడాను. అర్ధరాత్రివేళ ఆ పిల్లకి ఫిట్స్‌వస్తే రాత్రంతా ఒంటిగా జాగరణ చేస్తుంది. ఆ భర్త మీద దావా వేసారు వీళ్లవాళ్లు. కేసు నడుస్తూ వుండగానే దానితోసంసారం పెట్టాడు. ఒక్క వాయిదాకీ అతగాడు ఎటెండ్ అవలేదు. కేసు కొట్టేసారు. ఇప్పుడు కూడా దానితోటే వుంటున్నాడు. ఈవిడ గతేమిటి? ఏం చేస్తే వాడికి బుద్ధొస్తుంది?'' ఆవేశంగా అడిగింది నిర్మల.

''పోలీసులు యాక్షన్ తీసుకోవాలి'' అంది విజయ.

నేను ఆమెవైపు చూసాను. వెక్కిళ్లు పెట్టి ఏడుస్తోంది.

''మా వీధి చివర కొత్తగా అద్దెకి దిగింది. పిల్లకి ఫిట్స్ వస్తున్నాయని ఇల్లుగలావిడ ఖాళీ చేసి పొమ్మందిట. నాకు నిన్న చెప్పి ఏడ్చింది. వీళ్లు ఇలా నానా కష్టాలు పడి నిలువ నీడ లేకుండా అలమటిస్తుంటే వాడు వుంచుకున్న దానికి ఇల్లు కట్టించి కులుకుతున్నాడు. దౌర్భాగ్యుడు'' అంది నిర్మల.

''ఆడదానికి ఆడదే శత్రువు అన్న నానుడి నిజం చేస్తారు కొందరు ఆడవాళ్లు'' అక్కసుగా అంది విజయ.

''సరే...సరే ఇప్పుడు ఆవిడ సమస్యకి పరిష్కారం ఆలోచించండి పాపం'' అంది రమ.

''ఏమ్మా! విమెన్ ప్రొటెక్షన్ సెల్ అంటే తెలుసా? ఆడవాళ్ల సమస్యల్ని పరిష్కరించే పోలీస్ విభాగం అది. అక్కడ రిపోర్టు చెయ్యి. ఇరవై నాలుగు గంటలలోపు యాక్షన్ తీసుకుంటారు'' అని సలహా ఇచ్చాను.

''ఇలాగే మా అక్క వియ్యపురాలి ఆడబిడ్డకి'' అంటూ విజయ ఎవరి గురించో చెప్పసాగింది.

''నేను విమలని గమనిస్తూ కూర్చున్నాను. తన మెడలో మూడుముళ్లు వేసి తనని కడదాకా

కాపాడుకుంటానని వాగ్దానం చేసిన భర్త మధ్యలో వదిలిపోతే చట్టాన్నీ, పోలీసుల్నీ ఆలంబనగా చేసుకుని అతన్ని తన దగ్గరకు పిలిపించుకోవడం అనే స్థితి చాలా దుర్భరం అనిపించింది. జరుగుతున్న చర్చ తనకి అవమానంగా, తన ఆడతనాన్ని కించపరిచేదిగా ఆమె భావిస్తున్నట్లుగా నాకు అనిపించింది. టాపిక్ సినిమాలవైపు మళ్లించాను. ఆ తరువాత నిర్మల చేసిన బాంబినో బోండాల మీద కాసేపు జోక్స్ కట్ చేసుకున్నాం. రాత్రి ఇంటి కొచ్చినా విమల దీనమైన ముఖం నన్ను వెన్నాడుతూనే వుంది. మోసపోయిన మహిళ అని కథ వ్రాయనా? అనుకున్నాను. ఇలాంటివి పుంఖానుపుంఖాలుగా వచ్చాయి. ఏం వున్నది ఇలాంటి చరిత్రల్లో కొత్తదనం అని ఊరుకున్నాను.

ఆ మరునాడు అమ్మమ్మకి సీరియస్‌గా వుందని కబురొచ్చి ఊరెళ్లాను. ఆవిడకి కాస్త సర్దుకున్నాక రెండు రోజుల తరువాత ఇంటికి తిరిగొచ్చాను.

నేను ఊర్నుండి వచ్చేసరికి ఇల్లంతా కంగాళీగా వుంది. పెరడంతా నానా చెత్తతో అసహ్యంగా వుంది. మా పనిమనిషితో ''నీవల్ల కాదుగానీ వెళ్లి చాంద్‌బీబీని పిల్చుకురా. దాని చెయ్యి పడితేగానీ పనికాదు'' అన్నాను.

పనిమనిషి వెంటనే ''చాంద్‌బీబీ ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయిందిగా'' అంది.

నేను ఆశ్చర్యంగా ''దాని స్వంత ఇల్లు అది ఖాళీ చేయడం ఏమిటి?'' అన్నాను.

''అయ్యో అమ్మా! నీకు తెలీదు. ఆరోజు ఆడ పోలీసులొచ్చి వంట చేసుకుంటున్నదాన్ని తన్ని తప్పేళా, చెంబూ బైట పడేసారు. స్వామినాథన్‌గాడ్ని సెల్‌లోపెట్టి మెత్తగా దంచారు. దాంతో వాడు ఇంటికొచ్చి ''ఈ ఇంట్లో తన పెళ్లాన్ని వుంచకపోతే తనని పోలీసులు జైల్లో పెడ్తారని ఏడ్చాడుట. చాంద్‌బీబీ సాయంత్రానికి ఆ పక్కనున్న మేదర బస్తీలో గది చూసుకుని వెళ్లిపోయింది'' అంది.

నాకు ఆ కథ నమ్మశక్యంగా అనిపించలేదు. చాంద్‌బీబీది ఎంత పవర్‌ఫుల్ క్యారెక్టరో నాకు తెలుసు. అది అంత తేలిగ్గా సవితికి ఇల్లిచ్చి పోయేరకం కాదు. పైగా ఆ ఇల్లు దాని కష్టార్జితంతో కట్టిందికానీ వాడి సంపాదన కానీ లేదు.

నేను త్వరగా పని చేసుకుని చాంద్‌బీబీని పలకరించడానికి వెళ్లాను.

ఆ పూరిగుడిసెకి నేను వెళ్లేసరికి చాంద్‌బీబీ పలకమీద ఏవో లెక్కలు వేస్తోంది. నన్ను చూడగానే ఆనందంగా రమ్మని పిలిచి మూలనున్న చాప తెచ్చి పరిచింది.

నేను డైరెక్ట్‌గా విషయం మాట్లాడాను. ''నీ ఇల్లు నీ పేరుమీద లేదా? ఎందుకు వదిలేసి వచ్చావు?'' అన్నాను.

చాంద్ కళ్లనీళ్లు పెట్టుకుంది.



''వాడు నేను వెళ్లనంటే గన్నేరు పప్పు తెచ్చి నూరుకుని తిని చస్తానన్నాడమ్మా. వాడి రిటైరైన డబ్బుతోనే ఇల్లు కట్టానని కోర్టు నమ్ముతోందిట. వాడు చచ్చాక నాకా ఇల్లు ఎందుకమ్మా? వాడు ఎక్కడో అక్కడ ఎవర్తోనో ఒకళ్లతో చల్లంగా వుంటే చాలు. పోనీ, పిల్లలగలవాడు. పాపం నా కోసం అందర్నీ విడిచి వచ్చాడు. ఇన్నాళ్లూ నాకు సాయంగా వున్నాడు. వాడు చస్తే నేను బతకగలనా?'' అని ఏడ్చింది.

నేను సంభ్రమంగా ఆమె మాటలు విన్నాను.

పచ్చి బూతులు మాట్లాడ్తూ మగాళ్లని సైతం కాలర్ పుచ్చుకుని కొట్టే చాంద్‌కి కూడా దేవుడు ఎంత సున్నితమైన మనసు ఇచ్చాడు. తన పురుషుడి కోసం తను కూడబెట్టిన సర్వస్వాన్ని త్యాగంచేసి కూడా ఎంత మామూలుగా వుంది. ఈ మనస్సేగా ఆమెని నిర్భాగ్యురాలిని చేస్తున్నది? మగాడి ముందు తన తప్పు లేకున్నా తల వంచేలా చేస్తున్నదీ. రైట్ వుండి కూడా తన ఆస్తిని తన పురుషుడి కోసం వదులుకున్నది. పెద్ద పెద్ద మాటల్లో చెప్పలేకపోయిందిగానీ ఎంత ఉన్నతమైన భావం. ప్రేమించింది కాబట్టి వాడు చావకుండా ఎక్కడో అక్కడ సంతోషంగా వుంటే తనకి చాలన్నది.

''చాయ్ తాగి వెళ్లు'' అని నాలిక కరుచుకుంది అలా అడిగినందుకు.

నేను ఆ రోజు ఆమె చేతి చాయ్ తాగే ఇంటికి వచ్చాను.

మా ఇంటికి వచ్చేదార్లో వున్న చాంద్‌బీబీ కట్టిన ఇల్లు చూసాను. చాంద్ చెమటలు కార్తుండగా ఆ గోడలు తాపీ చేయడం నా కళ్లల్లో మెదిలి మనసు భారం అయింది.

ఇంతలో ఆ ఇంట్లోంచి విమల బైటకి వచ్చింది. పక్కనే స్వామినాథన్ నవ్వుతూ పిల్లని ఎత్తుకుని వస్తున్నాడు.

విమల నన్నుచూసి ''అమ్మా! మీరా? రండి. ఇదే మా ఇల్లు. ఆ మాయదారి ముండని వదిలించి ఆ పోలీసోళ్లు నా కొంప నిలబెట్టారు. మీరిచ్చిన సలహాయే'' అని భర్తతో ఏదో చెప్తోంది.

నా చెవులకి ఆమాట శరాఘాతమై తగిలింది. ''మీరిచ్చిన సలహానే''

మైగాడ్! ఏం చేసాను నేను. ఓ ఇల్లు నిలబెడ్తున్నాననుకుని ఇంకో ఆడదాని ఇల్లు కూల్చాను. మధ్యలో లబ్ధి పొందింది స్వామినాథన్. అక్కడ ఏడ్చి దాని సానుభూతి, ఇక్కడ ఏడ్చి విమల సానుభూతి కొట్టేసి తన పబ్బం గడిపేసుకుంటున్నాడు. ఒక్కనాడూ ఆ ఇంటికోసం కష్టపడింది లేదు. చేసిందిలేదు. దర్జాగా పెళ్లాం పిల్లలతో అనుభవిస్తున్నాడు. అక్కడ చాంద్... పూరిగుడిసెలో...మళ్లీ తన జీవన పరపమద సోపానంతో మొదటి గడి నుండి బయలుదేరింది.

ఆడదానికి సున్నితమైన మనసునిచ్చి దేవుడు తన పక్షపాతం చూపించుకున్నాడు. ఆమె శారీరకంగా అబల. చాలా చాలా బలహీనమైన గుండెగలది. ఎప్పటిలాగే నాకు రాత్రుళ్లు నైట్‌క్వీన్ పరిమళాలు చాంద్ లొల్లాయి పదాలను మోసుకొస్తుంటాయి.

★